కథానిక

# ఊహించని ఉపకారం

యర్రా మురళీ కృష్ణమోహన్

కిటికీలోంచి కవరు కిందపడింది. విసుక్కుంటూ వెళ్ళింది ఉష. తనకు నెల్లాళ్ళనుంచి వస్తున్న ఉత్తరాలనుబట్టి ఆ ఉత్తరం ఎలావుంటుందో ఆమె ముందే ఊహించింది. తిట్టుకుంటూనే కవరు చించి చదవటం ప్రారంభించింది. ఉత్తరం చదువుతున్న కొద్దీ ఆమె ముఖంలో ఆశ్చర్యం రాను రాను సంతోషంగా మారి చివరికి ఒక్కసారి పెద్దగా నవ్వింది.

ఆ ఉత్తరంలో ఇలావుంది——

ఉషా,

నిన్న అకస్మాత్ గా రైల్లో గోపాలం కనిపించి అడ్రస్ ఇచ్చాడు. నీకు ఉత్తరం వ్రాయాలని చాలాకాలనుంచి అనుకుంటున్నాను కాని అడ్రస్ లేనందువల్ల వ్రాయలేదు.

నువ్వు వెళ్ళిపోయినప్పటినుంచి లోకం కోడై కూస్తోంది. కుయ్యానియ్యి—అదేంచేస్తుంది. నిన్ను చాలా బాధకరమైన మాటలు అనటం కూడా వినాల్సివస్తుంది. అయినా సహిస్తున్నాను. ఏం చేయను. నువ్వు కాపరానికి వచ్చిన కొత్తలోనే అనుకున్నాను; ఈ ఆడంగి సన్యాసితో నువ్వెంతో కాలం కాపరం చెయ్యవని. నువ్వు ఇంతకాలం వుండగలగటంకూడా ఆశ్చర్యమయింది. ఒకవేళ నువ్వు పతివ్రతా పిచ్చిలో పడ్డావేమో అని చాలా భయపడ్డాను. కానీ నువ్వు ఇంతకాలం ఛాన్సు కోసం వేచివున్నావని అనుకోలేదు. ఇలా జరగటం చాలా అన్యాయంగా ఇక్కడ అందరికీ కనిపిస్తుంది ఇంతకాలానికి కాని ఇలా జరగకపోవటం అన్యాయంగా కనిపించింది నాకు.

పైకి చెప్పటానికి దమ్ముల్లేకపోయినా నువ్వు చేసినపనికి లోపల సంతోషిస్తున్నది మన వీధిలో నేనొక్కడినే. ఇంకోమాట-నువ్వు గోపాలంతో లేచిపోవటం నీ సౌఖ్యానికి, ఆనందానికీ కాక నాకు విలువలేని ఊహించన ఉపకారం చేశావు. అదెలా? అంటావు. అయితే చెబుతావిను.

అది జనవరినెల. అవాళ కాలేజీ వుంది.

అప్పుడే అటెండన్స్ వేసి షాయత్రీ పుస్తకం తెరిచాను.

“ వెంటనే బయలుదేరు” అంటూ టెలిగ్రాం వచ్చింది,

ఎందుకు చెప్మా ఇంత యమర్జంటుగా?

ఎవరికైనా ప్రమాదంగా వుంటే అదేదో వ్రాసేవారే! అని తెగ ఆలోచించా.

వెధవది సమయానికి సరిగా పనిచెయ్యదు ఈ బుర్ర. పావుగంట తర్జనభర్జన మీద తేలింది అసలు సంగతి.

కాబోయే ధర్మపత్ని చూసుకోనేందుకు రమ్మని మా నాన్న మూడుసార్లు వ్రాసాడు.

యూనివర్సిటీ పరీక్షలు జరుగుతున్నాయని, సెలవు దొరకదని; వంట్లో బాగాలేదని; వ్రాసి తప్పించుకున్నాను.

నిక్షేపంగా పెళ్ళికూతుర్ని చూసుకోనేందుకు రమ్మంటే నీలుగెందుకు? అని సందేహంవస్తుంది. అవును; మరివచ్చిన చిక్కే అక్కడ.

నువ్వు రమను చూసివుండవు; మా మామయ్య కూతురులే—అందచందాలతో అప్సరస కాకపోయినా, అందమయిన స్వరూపం. మనిషి పొడుగ్గా మాటతియ్యగా ఆకోలమొగంమీది చిరునవ్వులో కొంటెతనం బిగించి కట్టిన ఖటావ్ వాయిల్ చీరెగుండా కన్పించే శరీరపు నిమ్నోన్నతాల మీద ఊగులాడే నాగుపాములాంటి వాలుజడ చూస్తూ గంటలు కాదు రోజులు గడపొచ్చు. గోపాల అయితే అజంతా శిల్పం అనేవాడే! ఆ! అవునా మరి ఇక ఆగుతా: లేకపోతే వారి కవిత్వం అంటావేమో.

మా మామయ్య గ్రాడ్యుయేట్. అత్తయ్య స్కూలుఫైనల్ దాకా చదివింది. రమ ఇంటర్ పూర్తిచేసింది. కుటుంబం అంతా చదువుకున్న వాళ్ళు కావటం మూలాన ఆచారాలకు దాసులు

కాక, సంప్రదాయంఅంటూ మూలగక మామయ్యా అత్తయ్యా మమ్మల్నిద్దర్నీ స్వేచ్ఛగా వదిలేశారు.

ఒకరి అభిరుచులు మరొకరు తెలుసుకోగలిగాం;

ఒకరినొకరు బాగా అర్థంచేసుకగలిగాం;

మధుర స్వప్నాలలో మునిగిపోయాం;

ఊహా సౌధాల్లో తేలిపోయాం.

మూడేళ్ళు గడిచాయి.

నా ఆనర్స్ క్లాస్ పూర్తయింది.

"ఎవ్వరికి తలవంచని యువకుల సాహసమే లక్ష్మీ ఉజ్జయినికి."

కాని, ఎవ్వరికి తలవంచక, ఆత్మాభిమానం గల యువకులకు సెకండ్ క్లాసే గతి ఈ యూనివర్సిటీలలో.

లెక్చరర్లదగ్గర, ప్రొఫెసర్లదగ్గరా కాకాపట్టని నాకు సెకండ్ క్లాసిచ్చారు.

కాలేజీలో అసిస్టెంట్ లెక్చరర్ గా చేరాను.

పురుషుడయి పుట్టినందుకు పెళ్ళే పరమార్థంగా వున్న ఈరోజుల్లో— నాన్న పెళ్ళిప్రయత్నాలు ప్రారంభించాడు.

మామయ్య అయిదువేలిస్తానన్నాడు.

నాన్న మాట్లాడలేదు.

అంతకంటే ఇవ్వలేనన్నాడు మామయ్య.

కని, పెంచి, ఇంతవాణ్ణ్ని చేసినందుకుగాను సంక్రమించిన అన్ని హక్కులతోను నాన్న అంగీకరించలేదు.

ఎలా వొప్పుకుంటాడు?

పై సంబంధంవాళ్లు పదివేలని ఎగపడుతూంటే?

మామయ్య అమ్మనడిగాడు.

అమ్మమాత్రం నాన్నమాట కాదనగలదా?

కాదనలేకపోయింది.

మామయ్యకు మండింది.

భోజనంచెయ్యకుండా వెళ్లాడు.

తాతయ్య ఎటూ కాకుండా కిమన్నాస్తిగా చూస్తూ పూరుకున్నాడు.

విడవమంటే పాముకి కోపం-

పట్టమంటే కప్పకి కోపం-

తాతయ్యమాత్రం ఏంచెయ్యగలడు?

ఆయన మాట వినేదెవరు?

నెల్లాళ్ళ తరువాత—

ఆ వూరు వెళ్ళవలసివచ్చింది.

మామయ్యగారింటికి వెళ్ళాను.

మామయ్య పెళ్ళివిషయం ఏమీఎత్తలేదు.

అత్తయ్య నెమ్మదిగా కదిపింది.

ఎలా అయినా ఆడది!

"నా సంగతి నీకు తెలియదా అత్తయ్యా!" అన్నాను.

"నాన్నమాట కాదనగలవా? కాదని......" అంటూ సగంలో ఆపింది అత్తయ్య.

"నే పెళ్ళంటూ చేసుకోవటం జరిగితే అది రమతోనే"అన్నాను.

అత్తయ్య ముఖం చాటంతయింది.

"ఏమండోయ్! విన్నారా?"అంటూ మామయ్య ఆఫీసుగదిలోకి వెళ్ళింది అత్తయ్య.

ఎంత చదువుకున్నా అదేం చిత్రమో కాని, పెళ్ళి మాటలు వచ్చేసరికి ఆడపిల్లలకు వల్లమాలిన సిగ్గు!

రమ ఆ ఛాయల్లో ఎక్కడా కనిపించలేదు.

ఎలాగో తంటాలుపడి పట్టుకున్నాను—

కణ్వమహర్షి ఆశ్రమంలో శకుంతల జ్ఞాపకం వచ్చింది.

"మామయ్య వొప్పుకోలేదటగా!"

కళ్ళనీళ్ళుతిప్పింది వెర్రిపిల్ల.

ఇంతమాత్రానికేనా!

"ఎవడొస్తాడో చూస్తాగా!"అన్నాను.

రమ నవ్వింది. వెన్నెల కురిసింది.

నా హృదయం పొంగింది. గంతులేసింది.

చేతిలో చెయ్యివేసి మరీ వచ్చాను.

ఇంత గ్రంథం నడిచాక; నాన్న పై సంబంధం పిల్లను-చూచేందుకు రమ్మంటే ఎలావెళ్ళను చెప్పండి?

హరిహర బ్రహ్మాదులు ఏకమయి అడ్డొచ్చినా రమను తప్ప మరెవ్వరిని వివాహం చేసుకోకూడదనుకున్నాను.

కాని, కని, పెంచి, పెద్దవాణ్ణ్ని చేసిన నాన్న మాట కాదంటావా? నువ్వు బి. ఏ. ఆనర్స్ పాసయ్యావంటే ఆ ప్రజ్ఞంతా నీ ఒక్కడిదీ కాదు. అందులో నీ తలిదండ్రులకు చాలా భాగం వుంది. తినోతినకో, కట్టోకట్టకో గుమాస్తాగిరీ చేస్తూ అయిదేళ్లు నీకు పొరుగూళ్లో కాలేజీ చదువు చెప్పించాడంటే నాన్న ఎంత అవస్థపడివుంటాడు? ఆలోచించు...కన్నవాళ్ళని కష్టపెట్టి బాగుపడ్డ వాళ్ళెవరూ లేరు!'

ఇదంతా అంతరాత్మ అనవసరపు గోల. పాపం, దానికి మాత్రం ఏం తెలుసు? అప్పుడప్పుడు నలుగురూ అనేదో, లేక మనం అనుకొనేవో విని చిలక పలుకులు పలుకుతూంటుంది.

అప్పట్లో ఆ విషయం వదిలేసి కాలం గడిపాను. కానీ ఇక తప్పేలాలేదు. ఇంకో గంటకు ట్రైనుంది. వెంటనే టెలిగ్రాం చూపించి శలవు సంపాదించాను. దస్తరూ అవీ పెట్టివద్దామని కామన్ రూములోకి వెళ్లేసరికి రమణ కనిపించాడు. అతను నా డిపార్టుమెంటే, నాకంటే సీనియర్.

"ఏంరా ఏమిటి హడావిడి. ఎక్కడ్నుంచి టెలిగ్రాం" అన్నాడు.

"మా నాన్న దగ్గర్నుంచి రా."

"అంతా క్షేమమేనా?"

"ఆc!"

"మరి!"

"ఏముంది, పెళ్ళిచూపులకి."

"కంగ్రాట్యులేషన్స్, శుభస్య శీఘ్రం అన్నారు త్వరగా కానీ."

నేనేం మాట్లాడలేదు.

చెప్పినా ఏం తెలుస్తుంది?

ప్రత్యేకించి ఒక వ్యక్తిత్వం లేనివాడు, ఎటు గాలివీస్తే అటే వొరిగిపోతాడు.

"అదేమిటిరా, అలాగుందేం ముఖం ఆముదం తాగుతున్నవాడిలా? **What is wrong with you?**" అన్నాడు రమణ.

ఏమయినా సలహా చెప్తాడేమోనని అంతా చెప్పాను వాడికి.

"గట్టి చిక్కే వచ్చిందే!" అని వాడు కాసేపు ఆలోచించి "మీ నాన్న చెప్పినట్టు విను. ఆ సంబంధానికి వొప్పేసుకో నచ్చితే" అన్నాడు.

నే నిర్ఘాంతపోయాను వాడి సలహాకు.

"మరి రమ" అన్నా.

"ఆ అమ్మాయికేం? నిక్షేపంగా మరొకడు చేసుకుంటాడు. ప్రేమించి పెళ్ళిచేసుకోవటం మన దౌర్భాగ్యం కొద్దీ మన దేశాచారం కాదు" అన్నాడు వాడు.

"మరి మా ప్రేమ - ఆచారంకోసం ప్రాకులాడితే" "దేవదాస్ ఏంచేశాడుబ్రదర్! పార్వతిని ఎందుకు పెళ్ళిచేసుకోలేదు."

"ఎవడో దేవదాసు చేస్తే...అయినా నన్ను దేవదాసులా కమ్మనా నీ ఆశీర్వాదం?"

వాడేం మాట్లాడలేదు.

ఏదో కథల్లోనూ అక్కడా ఏవో ఆశయాలు ఆదర్శాలు అంటూ గీకటం తప్ప, గట్టిగా నిలబెట్టి ఏదైనా అడిగితే ఇంతే! అందుకే మా తాతయ్య అంటూ వుంటాడు ఈ కాలపు ప్రయోజకత్వాలు అన్నీ చాటునేగాని ముఖంముందు కావని.

కాసేపాగి "ఇప్పుడే వెళ్తున్నావా" అన్నాడు.

"ఆc!"

అయితే ఈ అవర్ నే తీసుకుంటా" అంటూ పోయాడు రమణ.

ఎవడి స్వార్థం వాడిది!

ఆలోచించగా ఆలోచించగా, జనమేజయుడు జ్ఞాపకంవచ్చాడు.

"కానున్నది కాకమానదు" అనుకొంటూ సిటీ బస్సులో కూలబడ్డాను.

ఆ సాయంకాలానికి యింటికి చేరుకున్నాను. భోజనాలు చేస్తున్నాం.

"కాలేజీ ఎలా వుంది" అన్నాడు నాన్న.

అదేం ప్రశ్న? ఏదో సంభాషణకోసం అనుకొని "బాగానే వుంది" అన్నాను.

"ఏరా! నీకేమైనా పేరుపెట్టారా?" అన్నాడు తాతయ్య నవ్వుతూ.

లేదని చెప్పాను నవ్వుతూ.

"ఈ వెధవ చిన్నప్పుడెంత అల్లరి చేసేవాడని; వాళ్ళ సైన్సు మాస్టారిని 'పొట్లాంకాయ్' అంటూ ఏడిపించేవాడు" అన్నాడు తాతయ్య పూర్వస్మృతుల్ని క్రోడీకరిస్తూ.

"అయితే, అన్నాయ్. 'పొడుగొంకాయ్' అని పేరు పెడతారులే" అంది అక్కడ వున్న చెల్లాయ్.

"ఛ, భడవా!" అన్నాడు తాతయ్య.

చెల్లాయి పరిగెత్తింది.

నా హృదయం కూడా పరిపరివిధాల పరిగెడుతోనే వుంది.

"ఊ! చూడు నీకు తెలిసేవుంటుంది" అంటూ ప్రారంభించాడు నాన్న తమలపాకులు నములుతూ. తెలియదన్నట్టు చూశాను.

"సీతారామయ్యగారని, రిటైర్డు తహశీల్‌దార్. ఏలూరులో వుంటున్నాడు. వాళ్ళ రెండో అమ్మాయిని నీకిస్తామంటున్నారు. పాపం! ఆయన నీకోసం మూడుసార్లు కబురెట్టాడు! తాతయ్యా, నువ్వూ అమ్మ వెళ్ళిరండి రేపుకూడా మంచిది. నాకు తీరికలేదు" అన్నాడు నాన్న.

"మామయ్యా..." అన్నాను.

"నాకు తెలుసు పిల్లే పదివేలిస్తామంటున్నారు" ఆయనకి ఇంకేం చెబితే అర్థం అవుతుందో నాకు కర్థంకాలేదు.

చెప్పొద్దూ! నాకు మహాకోపం వచ్చింది. వెంటనే ఏడుపూ వచ్చింది నా అసహాయస్థితికి.

ఆ సాయంత్రం తాతయ్య, అమ్మతో అంటున్నాడు.

"సూరిగాడికీ సంబంధం ఇష్టమున్నట్టు లేదమ్మాయ్!"

"వాడికి రమమీద వుంది" అంది అమ్మ.

"అవునుమరి! అందానికి, చదువుకి, గుణానికి పోతే కట్నం దగ్గరే వచ్చింది."

"మీకు తెలుసుగా మా అబ్బాయి సంగతి" అంది అమ్మ.

ఇంతలో నేను అక్కడికి రావటంవలన సంభాషణ అంతటితో ఆగిపోయింది.

"సూరిగా, అన్నీ చూసుకురా ఆ తరువాత ఏమనీ లాభంలేదు" అంది మాబామ్మ ఆమర్నాడు మమ్మల్ని సాగనంపుతూ.

"సరేలే! మహా నువ్వు చెప్పాలిలాగుంది. అది వాడికి తెలియదూ?" అన్నాడు నాన్న రుసరుసలాడుతూ.

మాతో స్టేషన్‌దాకా ఆయనకూడా వచ్చాడు. మెయిల్ గంటలేటుతో నురగలు కక్కుకుంటూ వచ్చింది. శ్రమలేకుండా ఖాళీగావున్న పెట్టె దొరికింది.

"అబ్బయ్! నువ్వు చదువుకున్నావ్; జీవితంలో ఏది ముఖ్యమో నీకు తెలుసు. ఈ అందచందాలు ప్రేమపిచ్చి ఈ నాలుగురోజులే, ఆ తరువాత అఘోరిస్తే లాభం వుండదు. అందం దేనికిరా? కొరుక్కుతింటావా? సిరిరామూకాలొడ్డు వాడుంటాడా! పిచ్చిపిచ్చి వేషాలేయకు నిక్షేపంగా పదివేలు!!" అని చెప్పవలసిందేదో అంతకుముందే చెప్పాడు నాన్న.

కెనడియన్ ఇంజన్ గర్జించి బయలుదేరింది మెయిల్.

"వస్తామరి; జాగ్రత్త" అని హెచ్చరించి నాన్న వెళ్ళిపోయాడు.

నాన్న సలహా, బామ్మ హెచ్చరిక నామస్తిష్కంలో కుస్తీపట్టటం ప్రారంభించాయి. చివరికేది గెలుస్తుందో? రమ జ్ఞాపకం వచ్చేసరికి, నాన్న సలహా, అలసిపోయింది. బామ్మ హెచ్చరిక విజయగర్వంతో కనిపించింది.

"పేపరోమాటిస్తారా" అడిగాడు పక్కాయన.

ఆయనకు పేపరిచ్చి చుట్టూ కలయచూశాను.

రకరకాల వ్యక్తులు కనిపించారు. బోర్డు తొమ్మిదిమందికి మించి కూర్చోరాదనిచెబుతోంది. రైల్వే రూల్సు పాటించేంత తెలివితక్కువ వాళ్ళెవరూ లేరని ఋజువుచేస్తూ ఆ పెట్టెలో పదహారుగురు వున్నారు.

నా పక్కాయన తారాబలం చూచుకొంటున్నాడల్లేవుంది "వృషభంలో రాహువు" అని గొణుగుతున్నాడు. నా ఎదుటి సాయబుగారు బీడి దమ్ములో తన్మయంపొందుతున్నాడు. ఆయన పక్క ఒక ముసలమ్మా, చిన్నపిల్లా కూర్చున్నారు. ఆ అమ్మాయి అడుగుతోంది ఈ రైలు పడిపోతే ఏమవుతుందని. ముసలమ్మ ఏదో సమాధానం చెప్పింది. ఆపక్కనేవున్న ముసలాయన ఆపిల్లవేపు కోపంగా చూస్తున్నాడు. పోతే ఆ నిలబడివున్న వ్యక్తుల్లో ఇద్దరు నన్నే చూడటం గ్రహించాను. చాలాసేపు మౌనంగానే గడిచింది.

"ఏవూరండి మీది?" అన్నాడు చూసిచూసి ఆ నిలబడ్డ వ్యక్తుల్లో ఒకాయన.

చెప్పాను.

"ఎక్కడికి వెళ్తున్నారు" తరువాత ప్రశ్న.

చెప్పాను.

"ఏం చేస్తున్నారు" మూడో ప్రశ్న.

అదీ చెప్పాను.

ఆ తర్వాత కులం: గోత్రం, వగైరా.

ఇంతసేపు మౌనంగా మా సంభాషణ వింటూన్న ఇంకోవ్యక్తి "ఇంకా అమ్మడు పోలేదా?" అన్నాడు గొంతు సవరించుకొని.

ఏ ఆవో. గేదో, పాలమో, ఇల్లో ఇంకా అమ్మడు పోలేదా అని ఎవరినో అడుగుతున్నా డనుకొని కిటికీలోంచి కదలిపోతున్న కరుకుసేల చూస్తున్నాను.

"మిమ్మల్నే" అన్నాడాయన.

ఆ కంఠం గాంభీర్యానికి ఆశ్చర్యపోయి ఎవ రినా? అని తలపైకెత్తి చూసాను.

ఆయన నా కళ్ళలోకి చూస్తూ "మిమ్మల్నే" అన్నాడు.

నేను నిర్ఘాంతపోయాను—

నేను అమ్ముడు పోవటం ఏమిటో అని.

చర్రున కోపంకూడా వచ్చింది.

తమాయించుకొని పరీక్షగా ఆయన్ని చూసాను.

అదో వ్యధిత హృదయం అని తెలుసుకొనేం దుకు నాకాట్టేటైము పట్టలేదు. ఆయన హృద యంలో ఆవేద ఆయన ముఖమే చెబుతోంది.

"Face is the Index of Heart" అని వెంటనే జ్ఞాపకం వచ్చింది.

ఆయన భాష అప్పటి కర్థమయింది.

ఆయనో ఆడపిల్లల తండ్రి.

ఆయన బాధపడ్తోంది ఆడపిల్లల పెళ్ళి చెయ్య లేక. అందుకే కసిగా నన్ను అమ్మడుపోలేదా అనడిగాడు అనుకున్నాను.

ఆయన ముఖంలోకి చూసాను.

ఆయన సమాధానం కోసం చూస్తున్నాడు.

నా పక్కన చూసాను.

తాతయ్య సుషుప్తావస్థలో వున్నాడు.

అమ్మ మాత్రం అంతా వింటోంది విచిత్రంగా!

ఆయన ప్రశ్నకు సమాధానం ఆయన భాష లోనే చెప్పాలనుకున్నాను.

"లేదండి; పాట ఇంకా ఒకటో సారిలోనే వుంది" అన్నాను.

ఆయన చిన్నవవ్వు నవ్వాడు. ఆయన ప్రక్కాయనా నవ్వేడు వీళ్ళిద్దరూ ఎందుకు నవ్వు తున్నారో తెలియకపోయినా మరోఇద్దరు నవ్వారు. కలకత్తా గొట్టెలు!

"ఎంతవరకూ వెళ్ళిందండి పాట" అన్నా డాయన కాసేపాగి.

"సుమారు పదివేలు" అన్నాను. ఆయన ముఖంలో రానున్న మార్పును గమనించదలచి పెద్ద డిటెక్టివ్‌లా.

"అయ్యబాబోయ్!" ఓ గావుకేక పెట్టా డాయన.

ఆయన ముఖం వివర్ణం అయింది.

"ఇంకా ఎంతవరకూ వెళ్తుందంటారు పాట" అన్నాడు ఆ నిలబడ్డ రెండోవ్యక్తి వెటకారంగా.

"ఏమోనండి. అది నాకెలా తెలుస్తుంది? అయినా అది పాడుకొనేవాళ్ళనుబట్టి వుంటుంది" అన్నాను.

నా పక్కాయన తారాబలం చూచుకోవటం పూర్తయినట్టుంది. పేపరు తిరిగి ఇచ్చేస్తూ—

"అదేం పెద్దకష్టం అనుకుంటున్నారా గుండెలు బాదుకుంటున్నారు? మా మేనల్లుడికి ఇరవై వేలి చ్చారు తెలుసా! వాడు ఇంజనీరు పనిచేస్తున్నాడు" అన్నాడు.

"అయ్యబాబోయ్"అన్నాయన ముఖాన కత్తి గాటుకి నెత్తురు చుక్కలేదు.

ఆయన గొంతులోంచి మాట పెగిలిరాలేదు. కాని చిన్న మూలుగుమాత్రం వినపడింది భీకరంగా.

మెయిల్ తాడేపల్లిగూడెంలో ఆగింది.

"వస్తారా రామం"అంటూ ఆయన దిగాడు.

"ఆఁ! ఆ విషయం వాకబుచేస్తాలే"అన్నాడు రెండో వ్యక్తి.

మెయిల్ కదిలింది.

"ఏవూరువెళ్తున్నారు?"అడిగాను రామంగార్ని.

ఏలూరు వెళ్తున్నట్టు చెప్పాడాయన.

"తాడేపల్లి గూడెంలో దిగినాయన మీ బంధువా?"

"అవునండి"అన్నాడాయన.

ఇకాపైన నేనేమీ అడగకుండానే చెప్పాడు. ఆయని పేరు నరశింహం అట. ఎలిమెంటరీస్కూలు టీచరు. ఆయనకు నలుగురాడపిల్లలు. అంతా పెద్ద లయి పెళ్ళిళ్ళకి సిద్ధంగా వున్నారు. పెద్దపిల్ల పెద్దయి రెండు పుష్కరాలు దాటిపోవటంవలన— విరక్తి కలిగి పెళ్ళిచేసుకోనందట. కులంవాళ్ళు— వాళ్ళు—అభాండాలువేసి వెలివేశారుట. ఇది ఆయన గాథ.

ఒక్కసారి నాకు ఆ నరసింహంగారు కళ్ళకు కనిపించారు. ఎంతబాధపడుతూండకపోతే ముక్కు మొగం ఎరగని వ్యక్తిని అంత వ్యంగ్యంగా ప్రశ్నిస్తాడు? ఆపైన నాలుగు చివాట్లు తినటానికైనా సిద్ధపడి!

మా ఇంటిపక్కాయన తన కూతుర్ని మూడో పెళ్ళి ముసలాడికిచ్చి ఎందుకు పెళ్ళిచేశాడో— ఆడంగి వెధవని తెలిసి మీనాన్న నిన్ను ఆ గిరిగాడికిచ్చి ఎందుకు పెళ్ళిచేశాడో నాకు అర్థమయింది.

కిరాతకుల కట్నాల శస్త్రం ఎలా మారణహోమంచేస్తోందో తెలిసింది. ఆ దెబ్బతో నాలో కొంత మనోబలం వచ్చింది. ప్రయాణోద్దేశం జ్ఞాపకం వచ్చింది. కలవరపడ్డాను. రమ జ్ఞాపకం వచ్చింది. హృదయం తేలికపడింది. ఏమయినాసరే ఎదిరించాలని నిశ్చయించుకున్నాను.

చూద్దాంగా అన్నట్టు కెనెడియన్ ఇంజన్ గర్జించింది. మెయిల్ ఏలూరు ప్లాట్‌ఫారంమీద ఆగింది. తాతయ్య "ఏవూరిది?"అంటూ మేల్కొన్నాడు.

నీకు విసుగ్గా వుందా? అయిపోయిందిలే కాసేపు ఓపికపట్టు మరి.

పెళ్ళివారింటికి వెళ్ళాం.

అమ్మాయిని చూపించారు.

పేరు ప్రేమలత

లతలాగే సన్నగావుంది పొడుగ్గా.

కారునలుపు కాదుకాని నలుపు

కొంచెం కాలు పెడగాలేసి నడిచింది.

పాటపాడమన్నారు, పాడింది

జిక్కీ జ్ఞాపకం వచ్చింది

కంఠంతో అంత మాధుర్యమయిన భగవంతుడు అలా ఎందుకు చేసాడో నాకర్థం కాలేదు.

గౌరవమర్యాదలు ఘనంగా జరిగాయి.

"అమ్మాయి నచ్చిందా"పెళ్ళివారడిగారు.

"ఏరా?"అన్నాడు తాతయ్య బయటికితీసికెళ్ళి.

లేదన్నాను.

"ఇంటికివెళ్ళి వ్రాస్తాం"అన్నాడు తాతయ్య.

పెళ్ళివారి ముఖాలు పాపం నల్లబడ్డాయి.

తిరిగి ఇంటికి చేరాం దార్లో ఏ సంఘటనా లేకుండా.

"ఏం? ఎలావుంది?"అన్నాడు నాన్న.

"పిల్ల నలుపు" అంది అమ్మ.

"అయితే ఏం!" అన్నాడు నాన్న.

అయితే ఏమో అమ్మ చెప్పలేక పోయింది.

"కాలుకొంచెం పెడగాలేసి నడుస్తుందిరా!" అన్నాడు తాతయ్య.

"మీది మరీ చాదస్తం" అన్నాడు నాన్న.

చాదస్తం కాదనలేక పోయాడు తాతయ్య.

కాసేపు ఎవరూ మాట్లాడలేదు.

"అయితే ముహూర్తం పెట్టమని వ్రాస్తాను" అన్నాడు నాన్న నాయిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా ఆయన అలా అనేసరికి నాకు పిచ్చెత్తింది కానీ...

"ఏరా! ఏమంటావ్!" అన్నాడు తాతయ్య వ్యవహారం చెయ్యి జారిపోతోందని తెలుసుకొని. రక్షించావ్ భగవాన్ అనుకొని.

"నాకు నచ్చలేదు" అని తప్పుకున్నాను రంగం నుంచి. ఇక చూసుకో; నాన్న పరశురాముడయిపోయాడు. కేకలువేసాడు. "నామాట కాదనేటంతవాడయ్యాడన్నమాట" అంటూ ఆయన ఆ పూట భోజనం చెయ్యకుండానే ఆఫీసుకు వెళ్ళాడు.

ఎవరి మూర్ఖానికి వాళ్ళామాత్రం బాధ పడాల్సిందే! ఆ సాయంత్రం భోజనాలయ్యాక అంతా సావిట్లో కూర్చున్నాం. నాన్న రుసరుసలాడుతోనే తమలపాకులు వేసుకొంటున్నాడు చెల్లాయి "ఉప్పుకప్పురంబు" అంటూ చదువుకుంటోంది. అమ్మ వంటిల్లూ అదీ సర్ది అప్పుడే కూచుంది. బామ్మ పురాణానికి వెళ్ళినట్టుంది.

ఇంతలో తాతయ్య వచ్చాడు "కలికాలం" అనుకొంటూ.

"ఏం జరిగిందో విన్నావా అమ్మాయ్!" అన్నాడు.

అమ్మాయి ఆయనవంక చూసింది.

"ఆ రామనాథంగారి రెండో కోడలు."

"ఆఁ! ఉమ" అంది అమ్మ.

"ఆఁ! అదేకాబోలు ... నిన్న సాయింత్రం దాకా వుందట."

"ఖర్మం పోయిందా ఏం?" అంది అమ్మ.

"పోయినా పీడా వదిలేది—వాళ్ళ గుమాస్తా గోపాలంతో లేచిపోయింది."

అమ్మ చెవులు మూసుకుంది. చెల్లాయి లేచి పోవటం అంటే అర్థంకాక చూస్తోంది.

నేనుమాత్రం తృప్తిగా నవ్వుకున్నాను యెవరూ చూడకుండా.

"మేనరికం చేసుకోమంటే రామనాథం మూలి గాడు. రెండువేలు ఎక్కువిచ్చారని పై సంబంధం చేసుకున్నాడు-పరువూ ప్రతిష్ఠా గంగలో కలిసింది" అన్నాడు తాతయ్య.

నాన్న వాసాలు లెక్కపెడ్తూ ఆలోచిస్తు న్నాడు. తాతయ్య ప్రారంభించాడు.

"అందుకే రమను చేసుకోవటం మంచి దమ్మాయ్! ఎవరో కట్నం ఎక్కువిస్తారని అడియాసలకు పోవటంకంటే"

అమ్మ నాన్న ముఖంలోకి, నాన్న అమ్మ ముఖంలో చూడటంతో నేను తాతయ్య ముఖం తాతయ్య నా ముఖంలోనికి చూడటం తటస్థయింది

ఆ రాత్రి నాన్న కలవరిస్తున్నాడు.

"పరువు పోయె!"

"ప్రతిష్టపోయే"

"ఏమిటేమిటి" అంటూ అంతా లేచాం.

"ఏవో పీడకల" అంటూ నాన్న కాళ్లు కడుక్కొని భగవద్గీత పారాయణచేసి పడుకున్నాడు.

ఆ మర్నాడుకూడా శలవు వుండటంవలన వుండి పోయాను.

అలా అలా ,తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి మామయ్య ప్రత్యక్షమయ్యాడు.

"ఎందుకు వచ్చాడా?" అది ఎంత ఆలోచించినా తీరలేదు సమస్య.

అమ్మ చెప్పింది నాన్న రమ్మని టెలిగ్రాం ఇచ్చాడని.

"ఎందుకు?" అన్నా

"రమని చేసుకోటానికి నాన్నగారు అంగీకరించారు" అంది అమ్మ.

"ఆఁ!! నిజంగా!" అన్నాను.

పెంకు లెగిరేను జాగర్తవోయ్ అన్నాడు తాతయ్య నవ్వుతూ.

ఆ వేసవి శలవుల్లో మా పెళ్ళయింది.

"అంతా ఉష చేసిన సహాయంకాని ఇందులో మీ ప్రజ్ఞ ఎమీ లేదంది" రమ ఆవాళ రాత్రి. ఏ రాత్రో నీకు తెలియదు కనుకనా!

కాదనే దమ్ములేక "ఇక రమచేసే సహాయం ఏమిటి" అన్నాను ముంగురులు సవరిస్తూ. ఇదీకథ.

ఇదంతా చూస్తే నీకు ఆశ్చర్యంగానే వుంటుంది పేరుప్రతిష్టలతోసరి పెద్దలపాట్లు.

ఇంకోమాట; గోపాలం వ్యామోహం శాశ్వతంగాను అతనికి పెళ్ళాం, పిల్లలూ వున్నారు. ఈవాళ కాకపోతే రేపయినా అతను నిన్ను వదిలి పోయేవాడేకాని వుండేవాడు కాదు. కాకపోతే నిన్ను ఆ నరకంలోంచి బయటకు తోసినందుకు నువ్వు అతనికి ఋణపడివుంటావేమో?

ఇలాంటి విషయాల పరిణామం చివరికి ఎలా వుండేది కథల్లో చదివే వుంటావు. అవి కథలు అంటావేమో?

కథల్లోనూ, కలల్లోనూ జరిగే విషయాలు కాకపోతే మరేవిటి ఈ రోజుల్లో జరిగేవి!

నీకు ఈ ప్రపంచంలో ఎవరూ లేకపోయినప్పుడు నన్ను మర్చిపోవద్దు. నీ ఉపకారానికి నన్ను కొంత ప్రత్యుపకారం చెయ్యనియ్యి—సూర్యనారాయణ."

వెయ్యేనుగుల బలంతో లేచి నిలబడింది ఉష ఆలోచిస్తూ.

---

"అమెరికాతో ఏకీభవించకపోయే హక్కు స్వతంత్రదేశాలకుంది. అమెరికా పట్ల గల అనుకూల వైఖరే స్వతంత్ర దేశాల స్వాతంత్ర్యానికి కొలబద్ద కారాదు... ఈ దేశాలు స్వతంత్రంగా వుండేటట్లు చూడడం అమెరికాకు క్షేమకరం ఎందువల్లనంటే, స్వతంత్ర దేశాలు పటిష్టంగా వుంటాయి. వాటితో భాగస్వామ్యం వహించి పనిచేస్తూ వాటికి మనం తోడ్పడగలం."

—(సెనేటర్ అలెగ్జాండర్ స్మిత్.)